క్లుప్తంగా

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



శావల్యాపురం: అర్హత కలిగిన పేదలందరికీ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయని ఈపూరు మార్కెటు యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలో కారుమంచి గ్రామ సచివాలయంలో నూతన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా చుండూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో కుల,మత,పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ మల్లావరపు విశ్రాంతం, ఎంపీటీసీ సభ్యులు బాబురావు, కారుమంచి సొసైటీ అధ్యక్షుడు బొల్లా వెంకట సాంబశివరావు, ఇడుపాలపాటి హనుమంతరావు, పంచాయతీ కార్యదర్శి చింతా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం సరఫరా వాహనం తనిఖీ



నాదెండ్ల: రేషన్ బియ్యం సరఫరా వాహనాన్ని చిలకలూరిపేట సీఎస్ డీటీ కొండారెడ్డి ఆదివారం తనిఖీ చేశారు. సాతులూరు బీసీ కాలనీలో రేషన్ కార్డుదారులకు బియ్యాన్ని సరఫరా చేస్తుండగా ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొద్దిరోజుల క్రితం వాహనదారులు రేషన్‌బియ్యాన్ని ఎలక్ట్రానిక్ కాటా ద్వారా ఇవ్వకుండా, డబ్బాల ద్వారా కొలిచి ఇస్తున్నారంటూ ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో బియ్యం సరఫరాను పరిశీలించారు. నిబంధనలు పాటించకుంటే రేషన్ డీలర్లు, వాహనదారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

అడవి పేరంటాళ్లమ్మ ఆలయంలో గేటు ఏర్పాటు

శావల్యాపురం: మండలంలోని బొందిలిపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీఅడవి పేరంటాళ్లమ్మ దేవాలయంలో ఈశాన్యం మార్గంలో నూతన ద్వారాన్ని ప్రారంభించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ సోమేపల్లి వీరాంజనేయులు తెలిపారు. దాత నాగుబడి నారాయణ – సీతామహాలక్ష్మి దంపతులు రూ. 30వేలు విలువ చేసే స్టీలు గేటు వితరణ చేశారన్నారు. నూతన ద్వార మార్గంలో ఆలయ పూజారి రమణయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆర్యవైశ్య జిల్లా నాయకుడు రెడ్డి గోపాలకృష్ణ, గ్రామపెద్దలు బోడాల రత్తయ్య, అల్లూరి వెంకయ్య, చింతా వీరయ్య, పసుమర్తి బసవయ్య, తన్నీరు రామయ్య, కుంచాల వెంకటస్వామి, రాంబాబు, బోడాల ప్రసాదరావు, పాపసాని సాంబయ్య పాల్గొన్నారు.

కళ్లజోళ్ల పంపిణీ

శావల్యాపురం: గడిపూడి వెంకట్రాయుడు, భిక్షావతి ట్రస్ట్ ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి, పెదకాకాని సహకారంతో కంటి ఆపరేషన్లు పూర్తి చేసుకున్న 220 మందికి స్థానిక సొసైటీ కార్యాలయంలో ఉచితంగా కళ్ల జోళ్లను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు సోనాలి బెహరా, భక్తి, క్యాంప్ ఇన్‌చార్జి రవికాంత్, పారా మెడికల్ స్టాఫ్, ట్రస్ట్ నిర్వాహకుడు గడిపూడి వెంకట్రాయుడు, రైల్వేబోర్డు మెంబరు గోరంట్ల సత్యనారాయణ, చెరుకూరి ప్రసాదరావు, సొసైటీ సీఈఓ జాలాది నాగప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జక్రయ్య సేవలు అభినందనీయం

శావల్యాపురం: అంకిత భావంతో విధులు నిర్వహించిన ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల మన్ననలు పొందుతారని వినుకొండ ఇన్‌చార్జ్ పోస్టల్ అధికారి (ఐపీఓ) దాదావలి అన్నారు. మండలంలోని పోట్లూరు గ్రామంలో పోస్ట్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న బొల్లాపల్లి జక్రయ్య పదవి విరమణ చేసిన సందర్భంగా ఘనంగా సత్కారించారు. ఈసందర్భంగా ఐపీఓ మాట్లాడుతూ 45 సంవత్సరాల పాటు తపాలా శాఖలో మెరుగైన సేవలు అందించి అందరి మన్ననలు పొందటం అభినందనీయమన్నారు. అనంతరం జక్రయ్య దంపతులను పోస్టల్ అధికారులు, సహచర సిబ్బంది, కుటుంబ సభ్యులు పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో పోస్టల్ అధికారులు లక్ష్మీరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నరసరావుపేట జిల్లా ఫ్యామిలీ వైద్యాధికారి నోడల్ అధికారి కె.హనుమాకుమార్, కేవీఆర్ మోహన్‌చందు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు రాజీవ్‌గాంధీకాలనీలో గడప గడపకు..

నాదెండ్ల: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం గణపవరం గ్రామంలో నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కాట్రు రమేష్ తెలిపారు. ఏడో రోజు కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని రాజీవ్‌గాంధీకాలనీలో జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని పాల్గొంటారని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం

ప్రత్యేక హోమాలు, పూజలు చేసిన ఎమ్మెల్యే బొల్లా, ఆలయ కమిటీ సభ్యులు



కొండపైన ప్రత్యేక హోమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన



బాల ఆలయాలకు కలశాలను తరలిస్తున్న దృశ్యం

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ కొండపై వెలసిన రామలింగేశ్వర స్వామి దేవాలయం ఇకపై కనుమరుగవనుంది. శ్రీరాముడు స్వయంగా ప్రతిష్ఠించిన శివలింగంగా ప్రసిద్ధిగాంచిన రామలింగేశ్వర ఆలయంలో నూతన దేవాలయం నిర్మాణంలో భాగంగా పాత దేవాలయాన్ని జీర్ణోద్ధరణ గావించేందుకు సర్వం సిద్ధం చేశారు. ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి ఈ నెల 8వ తేదీన దేవాలయాన్ని శాస్త్రోక్తంగా తొలగించనున్నారు. ఈ సందర్భంగా కొండపైన రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక హోమాలు, పూజలు, బాల ఆలయ నిర్మాణ పనులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో పాటు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొని వేదమంత్రాల నడుమ గోపూజ, హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ ఇప్పటికే దేవాలయానికి వెళ్లేందుకు ఘాట్ రోడ్డు నిర్మాణం పూర్తి చేశామని, అదేవిధంగా గిరి ప్రదక్షిణం రోడ్డుతో పాటు కొండపైన దేవాలయం, గాలిగోపురం నిర్మాణాలకు రూ.25కోట్లు వెచ్చించనున్నామని, ఇటీవల దేవాలయం నూతన కమిటీ ఏర్పాటు చేసి భక్తుల నుంచి విరాళాలను సేకరిస్తున్నామని చెప్పారు. దేవాలయ మండపం నిర్మాణానికి రూ.5కోట్లు ఖర్చు కానుండగా, గాలి గోపురం నిర్మాణం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సొంత నిధులతో నిర్మిస్తున్నామని, దేశంలోనే ప్రఖ్యాత దేవాలయాల సరసన నిలబెట్టేందుకు ఆగమనశాస్త్ర పండితుల సూచనలతో పాటు ప్రముఖ వేదపండితుల సూచనలు, సలహాల మేరకు దేవాలయ నిర్మాణాలు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు పెండేల వెంకట పుల్లారావు, ప్రెసిడెంట్ పులిపాటి రామారావు, సెక్రటరీ జాజుల మాల్యాద్రి, వైస్ ప్రెసిడెంట్ చందోలు మల్లికార్జున రావు, గంధం బాలిరెడ్డి, జాగర్లమూడి సుబ్బారావు, గజవల్లి పవన్, దండు చెన్నయ్య, ములకా రామతులసిరెడ్డి, అచ్యుత కృష్ణ, కన్నెగండ్ల అనంత రామకోటేశ్వరరావు, గోవిందనాయక్, రెడ్డి నగేష్, తేలికపల్లి బాబు, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా రీసర్వే పనులు

ఆర్డీఓ శేషిరెడ్డి



శావల్యాపురంలో సరిహద్దు రాళ్లు పాతే పనులు పరిశీలిస్తున్న ఆర్డీఓ శేషిరెడ్డి

శావల్యాపురం: నరసరావుపేట డివిజన్ పరిధిలో రీసర్వే పనులు ముమ్మరంగా జరుగుతున్నట్లు నరసరావుపేట ఆర్డీఓ మర్రిడ్డి శేషిరెడ్డి ఆదివారం అన్నారు. ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో 78 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పనులు పూర్తయ్యాయని, ఇప్పటివరకు 35 వేల మంది రైతులకు భూహక్కు పత్రాలను అందజేశామన్నారు. వినుకొండ నియోజకవర్గంలో బొల్లాపల్లి మండలం మినహా మిగిలిన మండలాల్లో రీసర్వే పనులన్నీ తుదిదశకు చేరాయన్నారు. రీసర్వే పూర్తి అయిన గ్రామాల్లోని భూముల్లో సరిహద్దు రాళ్లు పాతే కార్యక్రమం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. ఈనెల 8వ తేదీవరకు రోజుకు 14 వేల సరిహద్దు రాళ్లు భూముల్లో పాతే పనులు జరిగేలా లక్ష్యంగా ఎంచుకున్నామని, ఇందుకుగాను 42 వేల స్టోన్ ప్లాంటేషన్ పనులు జరిగేలా క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులకు దిశా నిర్దేశం చేశామన్నారు. ఆధునిక రోవర్ యంత్ర పరికరాలు ద్వారా రైతుల సమక్షంలో రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో సరిహద్దు రాళ్లు పాతాలన్నారు. రీసర్వే పనులకు సంబంధించి ప్రభుత్వం రైతులకు అన్నీ రకాల సేవలు ఉచితంగా అందిస్తుందన్నారు. ఏలాంటి రుసుము రైతులు చెల్లించే పనిలేదన్నారు. శావల్యాపురం మండలంలో ఐదు రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పనులు నూరుశాతం పూర్తయ్యాయని, అందులోభాగంగా వేల్పూరు, పోట్లూరు, కనమర్లపూడి, శానంపూడి, పిచికలపాలెం రెవెన్యూ గ్రామాల్లోని రీసర్వే పూర్తయిన భూముల్లో సరిహద్దు రాళ్లు పాతే పనులు జరుగుతున్నాయన్నారు. రోజుకు 1800 రాళ్ల ప్లాంటేషన్ జరిగేలా భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించామన్నారు. ఆయనతో పాటు తహసీల్దార్ షేక్ జాన్‌సైదులు, డీటీ వేముల వెంకట నాగరాజు, ఆర్ఐ పి.నాసరయ్య, చంద్రబాబు, వీఆర్వోలు ఉప్పుటూరి మంగయ్య, రాధ తదితరులు ఉన్నారు.

పేద రెడ్డి విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ట్రస్ట్ సభ్యులు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని యోగివేమారెడ్డి సేవా సమితి కార్యాలయంలో ఎడ్యుకేషన్ ట్రస్ట్ సభ్యులు ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడ్యుకేషన్ ట్రస్ట్ ద్వారా పేద విద్యార్థులకు అందజేయనున్న స్కాలర్‌షిప్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ట్రస్ట్ నాయకులు ఇన్నారెడ్డి, భాస్కర్‌రెడ్డిలు మాట్లాడుతూ అర్హులైన పేద రెడ్డి సామాజికవర్గానికి చెందిన విద్యార్థులకు తమ ట్రస్ట్ ద్వారా స్కాలర్‌షిప్‌లు అందజేయనున్నట్లు తెలిపారు. గత రెండు సంవత్సరాల నుంచి స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నామని, ఈ సంవత్సరం కూడా స్కాలర్‌షిప్‌లు పొందాలనుకున్న విద్యార్థులు వినుకొండ యోగివేమన రెడ్డి సేవా సమితి కార్యాలయం, గుడ్‌షెఫర్డ్, గీతమ్స్ పాఠశాలల్లో అప్లికేషన్లు తీసుకొని వాటిని పూర్తిచేసి అక్టోబరు 10వ తేదీ లోపల తిరిగి అందజేయాలని సూచించారు. జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్, ఐఐటీ, నీట్ పరీక్షల్లో మెరిట్ సాధించిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సుధాకర రెడ్డి, కృష్ణారెడ్డి, రామిరెడ్డి, సుందర్‌రెడ్డి, బి.నారాయణరెడ్డి, బెజ్జం వెంకటేశ్వరరెడ్డి, టీచర్ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణ్యం



మంత్రి అంబటికి నూతన వస్త్రాలు అందిస్తున్న కౌన్సిలర్ కూకుట్ల లక్ష్మి

సత్తెనపల్లి: పట్టణంలోని 20వ వార్డు కౌన్సిలర్ కూకుట్ల లక్ష్మి నివాసంలో ఆదివారం శ్రీ వెంకటేశ్వరస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు హాజరై, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కూకుట్ల లక్ష్మి, ఆమె కుమారుడు శ్రీనివాసరావు, భార్య కోటేశ్వరి మంత్రి అంబటికి స్వామి ప్రసాదంతో పాటు నూతన వస్త్రాలు బహూకరించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, నాయకులు రాయపాటి పురుషోత్తమరావు, అచ్యుత శివప్రసాద్, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ అనుబంధ సంఘాల బాధ్యులు, అధికారులు పాల్గొన్నారు.

లయన్స్ పురస్కారాలకు ఐదుగురు ఉపాధ్యాయుల ఎంపిక

సత్తెనపల్లి: గురు సత్కారోత్సవం –2023ను పురస్కరించుకొని రేపు సాయంత్రం 5 గంటలకు పట్టణంలోని భవిష్య పాఠశాల ఆవరణలో ఐదుగురు ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేయనున్నట్లు లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి టౌన్ అధ్యక్షుడు మంచికంటి వెంకటేశ్వరరావు ఆదివారం తెలిపారు. సత్తెనపల్లి మండలం నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ (మ్యాథ్స్) ఓరుగంటి శ్రీకాంత్, కంకణాలపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఎస్టీటీ వి.వి. గోపాలకృష్ణమూర్తి, నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీఈటీ లాకు పిచ్చయ్య, సత్తెనపల్లి కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ ఎం. ప్రసన్నరాణి, సత్తెనపల్లి శ్రీ బాబా గురుదేవ్ కళాశాల అధ్యాపకురాలు అబ్బూరి మంజరీదేవికి పురస్కారాల్ని అందజేయనున్నట్లు చెప్పారు. మాస్టర్ ఆఫ్ సెర్మనీగా లయన్ వై.పి. మురళీకృష్ణ వ్యవహరిస్తారన్నారు. ముఖ్య అతిథిగా సత్తెనపల్లి డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి ఏ.వెంకటేశ్వరరావు, విశిష్ట అతిథిగా ఉపాధ్యాయుడు, పాఠ్య పుస్తక రచయిత, సంపాదకుడు శ్రీనివాసుల రఘురాం, ఆత్మీయ అతిథులుగా లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ తోట చిన్న సాంబశివయ్య, డిస్ట్రిక్ చైర్మన్లు ఎంజెఎఫ్ కోట వెంకటేశ్వర్లు, కంబాల వెంకటేశ్వరరావు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పట్టణ ప్రజల్ని కోరారు. సమావేశంలో కార్యదర్శి లయన్ వల్లూరి శ్రీనివాసరావు, కోశాధికారి లయన్ తోట పద్మ, ప్రోగ్రాం చైర్మన్ లయన్ తవిటి భావనారాయణ పాల్గొన్నారు.

అచ్చంపేటలో భారీ వర్షం



అచ్చంపేట: మండల కేంద్రమైన అచ్చంపేటలో ఆదివారం ఉదయం భారీ వర్షం కురిసింది. తెల్లవారుజామున 3 గంటలకు ప్రారంభమైన వర్షం ఉదయం 6గంటల వరకు కుండపోతగా కురుస్తూనే ఉంది. లోతట్టు ప్రాంతాలు మొత్తం జలమయమయ్యాయి. మాదిపాడు రోడ్డులో మోకాళ్ల లోతు నీళ్లు నిలబడటంతో రెండు గంటలపాటు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. విద్యుత్ సబ్‌స్టేషన్‌ను వర్షపు నీళ్లు చుట్టుముట్టాయి. హైస్కూలు గ్రౌండ్‌లో నీళ్లు నిలబడ్డాయి. అచ్చంపేట–సత్తెనపల్లి రహదారిలోని వాగుపై నీళ్ల పారడంతో కొద్దిసేపు ఎక్కడి వాహనాలు అక్కడ నిలచిపోయాయి. రెండు నెలలుగా వర్షాలు లేక అల్లాడిన పత్తి, మిర్చి రైతుల సాగునీటి దాహార్తి పారింది. పొలాల్లో వర్షపు నీళ్లు పారడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రత్యేక పూజలు



రొంపిచర్ల: మండలంలోని కొనకంచివారిపాలెం గ్రామంలో ఇటీవల ప్రతిష్ఠ నిర్వహించిన గోవిందాంబ సమేత మద్విరాట్ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయంలో ఆదివారం 16 రోజుల పండగను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో వీరబ్రహ్మేంద్రస్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. వందలాది మంది భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

నేటి నుంచి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు



నాదెండ్ల: మండలంలోని చందవరం గ్రామంలో శాలివాహన సంఘం ఆధ్వర్యంలో రూ.15 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన రేణుక అంకమ్మ తల్లి దేవాలయ ప్రతిష్ఠ మహోత్సవాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు. సోమవారం ప్రారంభమయ్యే వేడుకలు ఈ నెల 8వ తేదీ వరకూ జరుగుతాయన్నారు. సోమవారం అమ్మవారికి కొలుపులు, జాతర, 7న కొలుపులు, 8న హోమాలు, ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం భారీ అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఐదు రోజులపాటు ఆలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

దాడిపై ఫిర్యాదు

చిలకలూరిపేటటౌన్: వివాహితతో అసభ్యకరంగా మాట్లాడమే కాకుండా ఆమె బంధువులపై భౌతికదాడికి పాల్పడిన ఇరువురిపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యండలంలోని మద్దిరాల గ్రామంలో సయ్యద్ సల్మా తన భర్త మహమ్మద్‌తో కలసి బడ్డీ కొట్టు నిర్వహిస్తుంది. సమీపంలోని బ్రిక్ కంపెనీలో పనిచేసే వేముల ప్రసాద్ శనివారం రాత్రి బడ్డీకొట్టుకువచ్చి సల్మాతో అసభ్యకరంగా మాట్లాడసాగారు. ఈ విషయాన్ని పిన్ని, తమ్ముడుకు చెప్పడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో ప్రసాద్ తన తమ్ముడు అనిల్‌తో కలసి వీరిపై దాడి చేశాడు. ఈ విషయంపై సల్మా రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, పోలీసులు కేసు నమోదు చేశారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

త్రుటిలో తప్పిన ప్రమాదం



సంఘటనలో బోల్తా కొట్టిన కారు

నరసరావుపేట టౌన్: కారు డివైడర్‌ను ఢీకొని బోల్తా కొట్టిన సంఘటన ఆదివారం తెల్లవారుజామున పట్టణంలో చోటుచేసుకుంది. నరసరావుపేట నుంచి చిలకలూరిపేట వైపునకు వెళ్తున్న కారు నాగుర్‌వలీ టాకీస్ సమీపంలోని ఓవర్ బ్రిడ్జి ప్రారంభమార్గంలో డివైడర్‌ను ఢీకొని బోల్తా కొట్టింది. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో ఆ సమయంలో ఎవ్వరూ లేకపోవటంతో ప్రాణాపాయం తప్పినట్లయింది. సంఘటనలో కారు పాక్షికంగా దెబ్బతినగా కారులో ప్రయాణిస్తున్న వారికి ఎటువంటి గాయాలు కాలేదు. సంఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని టూటౌన్ సీఐ వీరేంద్రబాబు తెలిపారు.

పేదల గుండెల్లో నేటికీ సజీవంగా వైఎస్సార్



మహానేత వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

రొంపిచర్ల: రాష్ట్ర ప్రజల గుండెల్లో దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పదిలంగా ఉంటారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా శనివారం రాత్రి మండలంలోని విప్పర్లపల్లి, రొంపిచర్ల, రామిరెడ్డిపాలెం, అలవాల గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అన్నదానాలతో పాటు అల్పాహార పంపిణీ కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు ఎంపీపీ గడ్డం బాలనాగమ్మ, చపారపు గోపాల్‌రెడ్డి, గెల్లి సుబ్బారెడ్డి, గెల్లి చిన కోటిరెడ్డి, కురుగుంట శ్రీనివాసరెడ్డి, గాదె రామిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, అన్నెం పున్నారెడ్డి, పడాల సుబ్బారెడ్డి, చపారపు సంజీవరెడ్డి, పచ్చవ రవీంద్రబాబు, రాజనాల వెంకటేశ్వరరెడ్డి, గడ్డం వెంకట్రావు, కోడూరి వెంకటేశ్వరరెడ్డి, గెల్లి బ్రహ్మరెడ్డి, గుండాల వెంకటేష్, మానుకొండ వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు మహానేత వైఎస్సార్...

యడ్లపాడు: మండలంలోని జాలాది గ్రామంలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. స్థానిక బీసీ కాలనీలో వైఎస్సార్ సీపీ మండల సీనియర్ నాయకుడు ఘంటా శంకరరావు ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ కార్యక్రమంలో ముందుగా వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఘంటా శివరామకృష్ణ, రాము, చంద్రశేఖర్, రాయపాటి వెంకటరావు, జరుగుల శంకరరావు, శేషగిరిరావు, మానం శంకరరావు, ఉర్లగుంట శ్రీనివాసరావు పాల్గొన్నారు. అదేవిధంగా యడ్లపాడు స్థానిక కొత్తూరు సెంటర్లో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం శనివారం రాత్రి నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ పిడతల రూపాస్సీ, పార్టీ జిల్లా కార్యదర్శి రాచమంటి చింతారావు, నాయకులు కురంగి నాగలమల్లేశ్వరరావు, కర్నాట సుబ్బారావు, బొంత ప్రభుదాసు, మాదం శ్రీను, కోడిరెక్క నాగరాజు పాల్గొన్నారు.

పొదల మాటున విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం



పచ్చని తీగల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ పట్టణంలో 7వ ఫీడర్‌కు అనుసంధానంగా పెద్దబోరింగ్ సెంటర్ వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ తీగలు అల్లుకొని ట్రాన్స్‌ఫార్మర్ కూడా కనిపించని స్థితికి చేరుకుంది. అలాగే చెక్‌పోస్టుకు వెళ్లే రోడ్డులో మరో ట్రాన్స్‌ఫార్మర్ పరిస్థితి కూడా ఇలాగే ఉంది. తిమ్మాయపాలెం రోడ్డు, దక్షిణంబజారు, కుమ్మరిబజారుతో పాటు పలు ప్రాంతాలకు విద్యుత్‌ను అందించే ట్రాన్స్‌ఫార్మర్ చెట్ల మధ్య కనుమరుగయ్యే స్థితికి చేరుకుంది. నిత్యం ఈ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫ్యూజులు పోతూ తరచూ అంతరాయం కలుగుతుంది. అయినప్పటికీ విద్యుత్ శాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాత్రి వేళల్లో విద్యుత్‌కు అంతరాయం కలిగితే ఎప్పుడు విద్యుత్ సరఫరా అవుతుందో చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. అలాగే పట్టణంలో కొన్ని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ముళ్లపొదల్లో దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి చెట్లను తొలగించి విద్యుత్ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

బంగారు పతకం సాధించడం గర్వకారణం



నాగజ్యోతిని సన్మానిస్తున్న కళాశాల పాలకమండలి సభ్యులు

చిలకలూరిపేట: తమ కళాశాల విద్యార్థిని బంగారు పతకం సాధించటం గర్వకారణమని డీఆర్ఎన్ ఎస్ సీవీఎస్ కళాశాల పాలక మండలి అధ్యక్షుడు తేళ్ల సుబ్బారావు చెప్పారు. కళాశాలలో బీఏ (స్పెషల్ తెలుగు) చదివిన ఉండవల్లి నాగజ్యోతికి గత ఆగస్టు 29వ తేదీన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా బంగారుపతకం అందుకుంది. నాగజ్యోతికి కళాశాల ప్రాంగణంలో ఆదివారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆమెను సన్మానించి కళాశాల తరఫున రూ.15 వేలు నగదు పారితోషకం అందజేశారు. కార్యక్రమంలో పాలక మండలి ఉపాధ్యక్షుడు ఘంటా జగన్నాథరావు, కార్యదర్శి మైలవరపు శివానందకుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ బైరా సుజాత తదితరులు పాల్గొన్నారు.

నేడు సత్తెనపల్లి తహసీల్దార్ కార్యాలయం ప్రారంభం

హాజరుకానున్న మంత్రి అంబటి రాంబాబు



తహసీల్దార్ కార్యాలయ భవనం

సత్తెనపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని మంత్రి అంబటి రాంబాబు సోమవారం ప్రారంభించనున్నారు. ఎన్నో ఏళ్లుగా పట్టణంలో కార్యాలయం శిథిలావస్థకు చేరి అటు అధికారులు ఇటు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. బ్రిటిష్ కాలంలో ఏర్పాటు చేసిన కార్యాలయంలోనే అధికారులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. వర్షాకాలం వస్తే అంతా తడిచి పోతోంది. వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలతో పాటు అధికారులు, సిబ్బంది నానా యాతన పడుతున్నారు. ఈ క్రమంలో గత ప్రభుత్వం నిర్మాణానికి పూనుకుంది. కానీ మధ్యలోనే వదిలేయడంతో శిథిలావస్థకు చేరిన భవనంలోనే ఉద్యోగులు కాలం గడుపుతూ వచ్చారు. ఇటీవల కురిసిన వర్షానికి కార్యాలయం పూర్తిగా నీటితో నిండి పోయింది. గత పాలకులు అసంపూర్తిగా వదిలేసిన భవన నిర్మాణాన్ని పూర్తిస్థాయిలో ఆధునికీకరించి, ప్రారంభోత్సవం చేసేందుకు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చొరవ తీసుకున్నారు. రూ. 1.2 కోట్లతో నిర్మించిన తహసీల్దార్ కార్యాలయం, దానిపైనే నైపుణ్య శిక్షణ అభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రహరీ నిర్మాణం కోసం రూ. 17.5 లక్షల్ని మంత్రి అంబటి రాంబాబు మంజూరు చేయించారు. త్వరలో పనులు కూడా ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం భవనం, పైన ఏర్పాటుచేసిన నైపుణ్య శిక్షణ అభివృద్ధి కేంద్రాన్ని మంత్రి అంబటి రాంబాబు ప్రారంభించనున్నారు. ప్రారంభోత్సవానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు, హాజరుకానున్నారు. ఎన్జీవో హోం వైపు నుంచి కార్యాలయానికి రాకపోకలు సాగేలా గేట్ ఏర్పాటు చేశారు. ఎట్టకేలకు ఏళ్లనాటి సమస్యకు మంత్రి చొరవతో పరిష్కారం లభించింది.

విద్యతోనే సామాజిక మార్పు సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ బాబూరావు

సత్తెనపల్లి: విద్య ద్వారానే సామాజిక మార్పు వస్తుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబూరావు తెలిపారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలో కార్డు సంస్థ ఆదివారం ఏర్పాటు చేసిన బాలబాట శిక్షణలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శిక్షణకు పల్నాడు జిల్లా డెప్యూటీ డైరెక్టర్ జి. సుబ్బారావు అధ్యక్షత వహించారు. బాబూరావు మాట్లాడుతూ దళితులు ఎదగాలంటే విద్య అవసరమని తెలిపారు. బాపట్ల డెప్యూటీ డైరెక్టర్ ఏ.సాంబశివరావు మాట్లాడుతూ సత్తెనపల్లి ఏరియాలో విద్యార్థులు గురుకుల పాఠశాలల్లో సీట్లు సాధించేందుకు అవసరమైన తర్ఫీదు కార్డ్స్ సంస్థ ఇస్తున్నట్లు చెప్పారు. ఏటా ఏడు రకాల కూరగాయల విత్తనాల్ని బాలబాట డెవలప్‌మెంటు ఆర్గనైజర్లు ద్వారా గ్రామాల్లో పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏరియా కో–ఆర్డినేటర్ రవి, డెవలప్‌మెంటు ఆర్గనైజర్లు పాల్గొన్నారు.